


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

*కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
*అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

15

**అతని కథల సంపుటి** అచ్చయి వచ్చింది. పబ్లిషర్ పైకానికి బదులు వంద కాపీలు పంపించాడు. మధుబాబుకు ఎగ్రిమెంటులాంటిది ఏమీ లేకపోవటం వలన మాట్లాడటానికి అవకాశం లేకపోయింది. అయినా మొదటిసారిగా పుస్తకం వెలువడిన మోజులో వుండబట్టి అంత పట్టించుకోనూ లేదు, తన ముఖ్య స్నేహితులందరికీ పుస్తకాలు పోస్టులో

పంపించేశాడు. ఇంకా మెడికల్ కాలేజిలోని స్నేహితులందరికీ పంచి పెట్టేశాడు. కొన్ని పుస్తకాలు గదిలో వుంటే పరిచయస్థులు వచ్చినప్పుడు చూసి పట్టుకుపోయారు. మొత్తం మీద కాసిని రోజుల్లో అన్నీ పూర్తయినాయి.

పత్రికల్లో సమీక్షలు మెచ్చుకుంటూనే వచ్చాయి. కాని లోకంలో ఓ రకం మనుషులుంటారు. అందరూ అవునన్న దాన్ని కాదనటం వాళ్ళకో సరదా. లేకపోతే మరి ప్రత్యేకత ఏమిటి? అలాగే ఓ విమర్శక మహాశయుడున్నాడు. ఆయన సాహిత్యంలో వివిధ శాఖలూ తాకిచూసి, ఎందులోనూ ఉచ్చస్థితికి రాలేక, చివరకు విమర్శలు రాయటం ప్రారంభించాడు. అదృష్టం బాగుండి విమర్శకుడిగా పేరు వచ్చింది. ఇంకేం? మానవుడికి నిరంకుశత్వం హెచ్చింది. ఐన దానిగురించి, కాని దాని గురించీ చిత్తం వొచ్చినట్లు రాయటం మొదలుపెట్టాడు. ఎవ్వరికీ కనిపించని ఆకర్షణ ఆయనకు కనబడుతుంది. అందరూ అభినందించిన దాంట్లో ఆయనకన్నీ తప్పుల కుప్పలూ మధుబాబు కథల సంపుటిని గురించి ఓ పత్రికలో రాస్తూ "ఇందులో మెచ్చుకోవాల్సిన సమాచారం ఏమీలేదు. బొత్తిగా అనుభవ శూన్యంగా వున్నాయి అని రాశాడు. మధుబాబుకు వళ్ళుమండింది. కాని ఏమి చేస్తాడు. దిగమ్రింగి ఊరుకున్నాడు.

అతనికి చిన్న వయసులో పేరు ప్రఖ్యాతులు వస్తూండటం, చక్కగా రాయగలగటం, అతని తప్పుకాదు. కాని వయసులో చిన్న కావటం "అనుభవం లేదు" అని విమర్శించటానికి అదను దొరికింది అసూయపరులకు.

ప్రజలంతా వేనోళ్ళ బాగుందని కొనియాడిన అతని నవలని గురించి రాస్తూ "అస్పష్టంగా వుంది. మసక మసగ్గా వుంది. మొత్తం మీద ఓ మాదిరిగా వుంది" అంటాడా విమర్శకుడు.

అతని ఆగడం అంతటితో సమసిపోలేదు. అతని కర్మంకాలి అదే రోజులలో రేడియోలో "నేటి తెలుగు సాహిత్యరీతులు" అని ఓ ప్రసంగం వచ్చింది. ఆ ప్రసంగం చదివినాయన వయసులోనూ, అనుభవంలోనూ, విజ్ఞానంలోనూ చాలా పెద్దవాడు. ఆయన మధుబాబు కథలనీ, నవలనీ ఉదహరిస్తూ ఈ యువకుడు సరికొత్త పోకడలతో కలాన్ని కదిలిస్తున్నాడు. అని మెచ్చుకున్నాడు. దాన్ని గురించి ఓ వ్యాసం రాసిపారేస్తూ విమర్శకుడు "ఫలానా ఆయన్ని గురించి ప్రసంగంలో ఉదహరించలేదు. ఫలానా యీయన్ని గురించి ఉదహరించలేదు. వాళ్ళు ఎంత గొప్పవాళ్ళు? కాని మొన్న వొచ్చిన మధుబాబుని గురించి మాత్రం అనవసరంగా పేర్కొన్నారు వెళ్ళబోసుకున్నాడు.

ఇదీ విమర్శకుడి వ్యాసాల విలువ.

యూనివర్శిటీ పరీక్షలు దెయ్యంలా సమీపిస్తున్నాయి. అసలే మెడికల్ కాలేజి విద్యార్థులు మిగతా వ్యాపకాలన్నీ పెట్టుకోకుండా ఎడ్లలా పని చేస్తారు. ఈ పరీక్షల సమయంలో వాళ్ళు పడే శ్రమ, చెందే కంగారూ హృదయ విదారకంగా

వుంటుంది. అటు ప్రొఫెసర్లు గుక్కతిప్పుకోనియ్యకుండా పని చేయిస్తూ కావలసినన్ని అక్షింతలు వేస్తూ వుంటారు. ఇటు గదులకి వచ్చి ఒకడిని చూసి ఒకడు పోటీ, అసూయపడి చదివేస్తూ వుంటారు. ఓ మాదిరి స్వతంత్ర భావాలున్నవాడు ఈ వాతావరణం భరించటం కష్టం. "ఇందులోకి ఎందుకు వచ్చానురా భగవంతుడా?" అని మధుబాబు విచారించిన క్షణాలు లేకపోలేదు. అతనేమిటి? ఇలా ప్రతి మెడికల్ స్టూడెంటూ ఎప్పుడో ఒకప్పుడు అనుకుంటూనే వుంటాడు.

ఈసారి ఏకాగ్రత కుదరటం కష్టంగా వుంది. కథల సంపుటి వెలువడటం, నవల, ఆ ప్రచారం, పేరు, ఉత్తరాలు అనుభూతి మనసుని  చక్కలిగింతలు పెట్టగా తరచు వాటిని గురించిన తియ్యని తలంపులే రాసాగినై. ఒక వైపునుంచి పరీక్షల భయం అధికమైపోతోంది. ఎట్లాగయినా ప్యాసయి తీరాలన్న పట్టుదల హెచ్చసాగింది. ప్రక్క విద్యార్థుల్ని చూస్తుంటే ఎక్కడలేని ఉద్రేకం వస్తోంది. రాత్రింబవళ్ళు బల్లముందునుంచి లేవకుండా చదివేయసాగాడు. అసలే మనిషి దుర్బలుడు. ఈ మానసికాందోళన, శ్రమ అతడ్ని మరింత బలహీనుడ్ని చేయసాగినై. ఆరోగ్యం పాడుకాసాగింది. వేళకు భోజనం వుండేదికాదు, అసలు ఏమన్నా తిందమన్నా సహించేది కాదు.  కాఫీలు తెగ త్రాగుతూండేవాడు. రాత్రిళ్ళు నిద్ర వస్తోంటే అరికట్టటానికి టాబ్లెట్స్ తెచ్చి వేసుకునేవాడు. ముఖంలో కాంతి హరించిపోసాగింది. కర్తవ్య పాలనలో మనసు మటుకు ఉజ్వలంగా ప్రకాశిస్తూ వుండేది.

చివరకు పరీక్ష రోజు రానే వచ్చింది. ఆ వేళ ఎనాటమీ పేపర్. అంతకుముందు రెండు రోజులు కన్ను మూయకుండా చదివాడు. ఆ రోజు కూడా చేతిలో పుస్తకం పెట్టుకుని గదిలో అటూ యిటూ తిరుగుతూ తెల్లవార్లూ చదువుతూనే వున్నాడు. ఏడుగంటలకల్లా కాఫీ త్రాగి, స్నానం చేసి కాలేజీకి వెళ్ళాడు.

పేపర్లు ఇచ్చారు. గగబా కొట్టుకుంటున్న గుండెతో మధుబాబు అందుకున్నాడు. అతనికళ్ళు ఆనందంతో మిలమిల మెరిశాయి. అన్నీ తెలిసిన ప్రశ్నలే. అతను తలవొంచుకుని రాయటానికి ఉపక్రమించాడు.

అయిదు నిమిషాలు గడిచాయి.

ఎందుకో చేతులు వొణుకుతున్నాయి. తన అక్షరాలు తనకే కనబడటంలేదు. అతనికి అర్థంకాలేదు. అయోమయంగా వుంది. ఓ నిమిషం ఊరుకుని నిర్లక్ష్యంగా వుండటానికి మళ్ళీ ప్రయత్నించాడు. కాని వొణుకు ఇంకా ఎక్కువవుతోంది. కడుపులో, గుండెల్లో ఏదో మంట. కళ్ళు చీకట్లు క్రమ్ముతున్నాయి. తలలో ఏమిటో గిర్రున తిరుగుతున్నట్లుగా వుంది. కళ్ళు మూసుకుని "ఏమిటిది భగవాన్" అనుకున్నాడు. ఇలా ఎప్పుడూ లేదు. ఎన్నడూ లేదు. కళ్ళు తెరిచాడు. లాభంలేదు. బలవంతంగా మూసుకుపోతున్నాయి. వాచర్‌ని పిలిచి తన స్థితి చెబుదామనుకున్నాడు. శక్తినంతా కూడదీసుకుని లేచి నిల్చోబోయాడు. అంతే, స్పృహతప్పి క్రిందపడిపోయాడు.

తెలివి వచ్చేసరికి తన గదిలో వున్నాడు. ప్రక్కన కాలేజీలో పనిచేసే డాక్టరు ఒకరూ, ఇద్దరు ఎటెండర్‌లూ వున్నారు. "ఏమీలేదు. అంత యెక్కువగా ఎందుకు చదవాలి? ఎగ్జామినేషన్ హాల్లో ఫెయింట్ అయి పడిపోయావు" అన్నాడు డాక్టర్.

"అరె ..ఆ.. నా ఎగ్జామినేషన్. ఇప్పుడు వెళ్ళి రాస్తాను."

డాక్టర్ "ఇంకేమిటి? ఓ అరగంటలో టైము అయిపోతుంది. బాగా రెస్టు తీసుకో. జరిపోయినదానికి విచారించకు. అయిందేదో అయిపోయింది. ఎట్లా వుంటుంది వొంట్లో? అన్నాడు.

మధుబాబు హతాశుడై "నెలలతరబడి పడిన శ్రమ అంతా బూడిదపాలై పోయింది" అని గొణుక్కున్నాడు. అతనికి ఏడుపు వచ్చింది.

"ఎట్లా వుంది?"

"చాలా బాగుంది.. చాలా బాగుంది."

ఎటెండర్‌తో కాఫీ తెప్పించుకుని తాగమనీ, సాయంత్రం వస్తానని చెప్పి డాక్టర్ వెళ్ళిపోయాడు. మధుబాబు మంచానికి అంటుకుని వుండిపోయాడు. యెంత శ్రమ యెంత శ్రమ. అతని గుండె పగిలిపోతోంది.

కొంతసేపటికి పరీక్ష రాయటం ముగించిన మిగతా విద్యార్థులు వచ్చి అతన్ని ఓదార్చసాగారు. అతనెవరికీ సమాధానం చెప్పలేదు. మౌనంగా ఊరుకున్నాడు ఆలోచిస్తూ.

కాని ఈ సంఘటన అంతటితో సమసిపోలేదు. సాయంత్రానికల్లా అతనికి జ్వరం వచ్చింది. మరునాటికి కూడా తగ్గకపోయేసరికి హాస్పటల్‌లో జాయిన్ చేశారు. మిగతా విద్యార్థులు వాళ్ళ ఇంటికి రాస్తానంటే మధుబాబు వద్దని వారించాడు. హాస్పటల్‌కి వచ్చి పదిరోజులయింది. టెంపరేచర్ తగ్గటంలేదు. రోజూ నూరు, నూట ఒకటి అలా వుంటూనే వుంది. చివరకు డాక్టర్లకు అనుమానం వొచ్చి ఎక్సరే తీయించి "టి.బి" అన్నారు.

మధుబాబుకు గుండెలవిసిపోయాయి.

"తక్షణం ఇంటికి వెళ్ళిపోవాలి. ఏడాదిదాకా చదువు డిస్‌కంటిన్యూ చేసి ఆరోగ్యాన్ని పొందాలి" ఇది డాక్టర్లిచ్చిన తీర్పు.

ఇంటికి ఉత్తరం రాయలేదు. ఆ రాత్రి సామానంతా తీసుకుని మిత్రుల సహాయంతో రైలు యెక్కాడు. ట్రెయిన్ మెల్లిగా కదిలి, వేగంగా విజయవాడ వైపు పరిగెత్తసాగింది.

పైన బెర్తుమీద పడుకుని మధుబాబు శూన్యంలోకి చూస్తూ ఆలోచించసాగాడు. "టి.బి" ఇతరులకి వచ్చినప్పుడు "అయ్యో" అని నిట్టూర్చే "టి.బి", తన కథల్లో పాత్రలకు వచ్చిన టి.బి."

అతని కళ్ళనుండి నీళ్ళు కారసాగాయి.

16

సుందరమ్మగారు కొయ్యబారిపోయినారు. విశ్వనాధరావుగారి గుండెలో ముల్లు విరిగినట్లయింది.

సామానుతో సహా ఇంటిముందు బండిదిగిన కొడుకుని చూసి  ఆయన పరీక్షలు అయిపోయి కాబట్టి వచ్చాడని భావించాడు మొదట. కాని లోపలకి ప్రవేశించిన కుమారుడి చిక్కి శల్యమైన అవతారం చూడగానే కంపితుడై "ఇదేమిటి?" అని గొణిగాడు.

"నాకు టి.బి నాన్నగారూ."

విశ్వనాధరవుగారు ఊళ్ళోని టి.బి స్పెషలిస్టుని తీసుకొచ్చి మధు  బాబుని పరీక్ష చేయించాడు. శానిటోరియంకి పోవాలనివుంది మధుబాబుకు. డాక్టర్ అలా సలహాయిస్తే బాగుండునని ఆశించసాగాడు. కాని ఆయన "ఇంకా ప్రిలిమినరీ స్టేజెస్‌లోనే వుంది. అనవసరంగా ఇంజెక్షన్లూ అవీ ఇవ్వటం ఇష్టంలేదు. ఆరునెలలు కంప్లీట్‌గా బెడ్ రెస్టు ఇవ్వండి. మంచి ప్రొటీన్‌ఫుడ్ ఇవ్వండి. టానిక్స్ రాసి ఇస్తాను" అని మధుబాబు భుజం తట్టి "ఏమీ బెంగపడకోయి. అసలు దీని గురించి ఆలోచించకు. జీవితాన్ని గురించి ఆప్టిమిస్టిక్‌గా తీసుకో. అన్నట్టు నీకేమైనా హాబీస్ వున్నాయా?"

"కథలూ అవీ రాస్తూ వుంటాడండి" అన్నారు విశ్వనాధరావుగారు.

"భేష్ ఇంకేం సాహిత్య ప్రియుడివన్నమాట. మనసుని యెక్కువ అలసట చెందనియ్యకుండా నీకిష్టం వచ్చిన పుస్తకాలు చదువుకో. పరిమితంగా రాసుకో. చికాకు కలిగించే ఏ విషయాన్ని గురించీ ఆలోచించక. స్టడీస్ ఓ ఏడాది పోతే పోనియ్. దాన్ని గురించి దిగులుపడక. ఆరునెలల్లో ఎలా తయారౌతావో చూడు."

ఆయన వెళ్ళిపోయాడు. కొడుకు దిగులుపడుతున్నాడని తండ్రి స్వాంతన వచనాలు పకలసాగాడు. మధుబాబుకు ఇంతకాలం ఇంట్లో ఈ దారుణ జీవితం గడపటం యెట్లాగా అన్న చింత ఎక్కువయింది. ఏ మదనపల్లో, పోయి శానిటోరియంలో జాయిన్ అయితే అక్కడి ప్రశాంతత, వాతవరణం యెంత ఆహ్లాదకరంగా వుంటుంది. కాని ఇది జరగదు. అతను నిట్టూర్చాడు.

ప్రపంచంలో బాగా మేపవలసిన వాడెవడయ్యా అంటే టి.బి పేషెంటు.

ఉదయం నిద్రలేచినప్పటినుంచీ కార్యక్రమమంతా తిండి గురించే.

రెండు కోడిగ్రుడ్లూ, పావుశేరు పాలతో కార్యక్రమం ఆరంభమౌతుంది. తరువాత మంచం మీద పడుకోవటం. పదకొండు గంటలకు భోజనం. వంటకాలలో ఏ మాత్రం కారం వుండకూడదు. అన్నం తడిసి ముద్దయేటట్లు నెయ్యి గుమ్మరించుకోవాలి. మళ్ళీ మధ్యాహ్నం రెండు గంటలకల్లా గ్లాసుడు పళ్ళరసం. నాలుగింటికల్లా పావుశేరు పాలూ, దాంతో పాటు బలమైన ఆహారం, ఏడుగంటలకు భోజనం,  పడుకోబోయే ముందు పాలు.

ఇవిగాక ఇంకా టానిక్కులూ, అవీ వీలయినప్పుడల్లా తీసుకుంటూ వుండటమే పని.

మధుబాబు విసిగిపోతున్నాడు. తిండికోసం బ్రతుకుతున్నట్టుగా వుంది. విశాఖపట్నంలో చేరాక కాఫీ ఒకటి బాగా అలవాటయిపోయింది.

అది లేకపోతే ఇప్పుడు ప్రాణసంకటంగా వుంది. తండ్రి చూడకుండా తల్లిని బ్రతిమాలి రోజుకి ఒకటి రెండు సారులు కాఫీ తాగేస్తూ వుండేవాడు.

జబ్బయితే అనుకున్నంత భయంకరంగా లేదు. కాని రోజులు గడవటం దుస్సహంగా వుంది. తల అంతా వివిధ ఆలోచనలతో గజిబిజిగా వుండేది. కాబట్టి ఏమయినా పుస్తకాలు చదువుదామన్నా బుద్ధిపుట్టేదికాదు. వ్రాయడానికి అసలు మనసుపోయేది కాదు. సాయంత్రాలు తరచూ ఉమాపతి వస్తూండేవాడు. ఇంకా ఒకరిద్దరు స్నేహితులు వస్తూండేవాళ్ళు. సాధారణంగా రేడియో పెట్టుకుని సినిమా పాటలు వింటూ వుండేవాడు. లేకపోతే పిల్లలతో కలిసి కేరం బోర్డు ఆడుతూండేవాడు. ఎవరితో ఎక్కువ మాట్లాడేవాడు కాదు. విశ్వనాధరావుగారికి కొడుకు దీనస్థితి చూస్తే బాధగా వుండేది. కథలు రాసుకో కూడదట్రా. ఎప్పుడూ ఆలోచిస్తూ కూర్చుంటే మనసు పాడౌతుంది. హాయిగా రాసుకో అనేవాడు. రాత్రిళ్ళు ఓ గంటసేపు ఆయనా, సుందరమ్మగారు, మధుబాబూ కలసి పేకాట ఆడేవాళ్ళు. మధుబాబు స్నేహితుడి దగ్గర  బుల్ బుల్ తరంగ్ ఒకటివుంది. వీలయితే అది వాయించటం నేర్చుకోవాలని చాలాకాలం నుంచీ అతడి కోరిక. కాని తండ్రి కోప్పడతాడని అణుచుకునేవాడు. ఇప్పుడు తండ్రి ఏమీ అనలేడాయె. అందుకని ష్నేహితుడితో అది తెప్పించుకుని టింగ్ టింగ్‌మని తిప్పలు పడుతూండేవాడు.

ఇంత చేస్తున్నా జీవితం నిస్సారంగా వుండేది. విధి తనని దగా చేసినట్లు నిరంతరం తపన పడుతూండేవాడు. ఎంత చేసినా యీ నాలుగు గోడలు దాటి బయటకు పోయే వీలు లేదు. ఓ రకం చెరసాల. ఏ  అర్ధరాత్రప్పుడో మెలుకువ వచ్చేది. ఉలికిపడేవాడు. మళ్ళీ నిద్రపట్టేదికాదు. ఎన్నో ఆలోచన్లు.

ఈ భూమ్మీద బాధించే వాళ్ళెవరంటే బంధువులు. మెడికల్ కోర్స్ చదువుతున్న కుర్రాడు ఇలా ఇంట్లో నెలల తరబడి కూర్చునేసరికి ముఖ్య బంధువుల్లోనూ ఇరుగు పొరుగుల్లోనూ సంచలనం కలిగింది. ఇంటికి ఎవరైనా వస్తూంటేనే తన గురించి ప్రశ్నిస్తాడేమోనని భయంగా వుండేది మధుబాబుకు. సరిగ్గా అలాగే జరిగేది. “మధు వచ్చాట్ట కదే సుందరం” అంటూ ఎక్కడినుంచో ఎవరో ఊడిపడటం, కాసేపు ఆ కబురూ ఈ కబురూ చెప్పి "కాలేజికి సెలవులేమిటి?" అని ఆరాదియ్యటం ఇదీ వరస.

Post your comments

*(కొనసాగింపు వచ్చే నెలలో)*